ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 6 ఆగస్టు 2025



రుయా సమీపంలో ఇలా



అమ్మలా అన్నం తినిపిస్తున్న సుజాత | మాటలకందని సేవ | ఆంధ్రజ్యోతిలో వార్తను చూస్తున్న అక్క అరుణ | అలిపిరి అనాథ స్నేహితుల వీడ్కోలు



మనుసున్నోళ్లకు మానవీయ స్పందన

తమ్ముడూ బేగొచ్చెయ్..!

- విజయనగరం ఎంపీ, తిరుపతి పోలీసుల సహకారంతో అక్క వద్దకు తరలివెళ్లిన నెల్లిమర్ల వాసి
- సామాజిక సేవకురాలు సుజాతకు ప్రశంసలు
- అక్కా తమ్ముళ్లను కలిపిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'తమ్ముడూ... బేగొచ్చెయ్..రా..' ఈ ఒక్క మాటతో ఆమె గొంతు పొలమారింది. దుఃఖం ఎగదన్నుకుని వచ్చింది. మొబైల్ ఫోన్‌లో తిరుపతిలోని అలిపిరి వద్ద రోడ్డు పక్కన ఉన్న తమ్ముడిని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చింది. వీడియో కాల్‌లో అక్కను చూస్తూ ఆ తమ్ముడూ దుఃఖసముద్రమే అయ్యాడు. 'అక్కా.. అక్కా..' అన్న మాట తప్ప మరేదీ అతని గొంతులోంచి పెగల్లేదు. ఆ అక్కా తమ్ముళ్ల దుఃఖం చూసినవారంతా కంట తడిపెట్టారు. తమ్ముడిని ఆ స్థితిలో చూడలేక, దుఃఖాన్ని ఆపుకోలేక ఆమె ఫోన్ కట్ చేసేసింది. కాసేపటికి మళ్లీ లైన్‌లోకి వచ్చి 'తమ్ముడూ నాకు చెప్పకుండా ఒక్కడివే తిరపతికి ఎందుకెల్లావ్..?' అని ఏడుస్తూనే కోప్పడింది. 'ఒక్క ఫోన్ చేసివుండొచ్చు కదా' అని నిష్టూరాలాడింది. 'నాకేదీ గ్యాపకం లేదక్కా.. నా బ్యాగు, పర్సూ కూడా లేవక్కా.. సుజాత అని ఒక తల్లి నాకు ప్రేణం పోసిందక్కా..' అంటూ అతనూ ఏడుస్తూనే వివరించాడు. తమ్ముడు పడ్డ బాధలు వినే శక్తి బహుశా ఆమెకు లేదేమో.. 'బేగొచ్చెయ్.. తమ్ముడూ.. ఇక ఎక్కడికీ వెళ్లద్దు.. నా దగ్గరే వుండిపోదూ..వచ్చెయ్' అంటూ ఫోన్ పెట్టేసింది.

రుయా నుంచి తరలిస్తున్న అలిపిరి సీఐ రామకిశోర్



నెల్లన్నర కిందట తిరుమలకు దర్శనానికి వచ్చి అన్నదాన సత్రం వద్ద కళ్లుతిరిగి పడిపోయిన హార్డ్‌వేర్ ఇంజనీర్ కోరుమల్లి వెంకట్రావు, కదల్లేని స్థితిలో అలిపిరి సమీపంలో రోడ్డుపక్కన పడి వుండిపోయిన తీరును ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. 'అక్కా.. వచ్చి నన్ను తీసుకుపో' అంటూ ప్రచురించిన వార్త అక్కా తమ్ముళ్లను చేరువ చేసింది. అలిపిరి అనాథలకు అమ్మలా సేవచేసే సుజాతకు వెంకట్రావు చెప్పిన వివరాల ఆధారంగా ఆంధ్రజ్యోతి నెల్లిమర్ల రిపోర్టర్ సారిపల్లిరోడ్డులోని బృందావన్ వ్యాలీలో విచారించగా అక్క అరుణా పాతక్ ఇల్లు దొరికింది. ఢిల్లీలో ఇంజనీర్లుగా పనిచేసి రిటైరైన ఆమె, ఆమె భర్త ప్రస్తుతం ఇక్కడ ఉంటున్నారు. వెంకట్రావు పెళ్లి చేసుకోలేదు. ఒక్కడే విశాఖపట్టణంలో ఉండేవాడు. నలుగురు అక్కచెల్లెళ్లను తరచూ వెళ్లి కలిసేవాడు. నెలన్నరగా అతని ఫోన్ పలకకపోవడంతో వారు ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని అనుకున్నారు. తిరుపతిలో మరుగుదొడ్ల పక్కన ఇటువంటి స్థితిలో ఉంటాడని వారు ఊహించలేదు. ఆంధ్రజ్యోతి సమాచారంతో, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందనతో ఇప్పుడు తమ్ముడి రాక కోసం నెల్లిమర్లలో ఎదురు చూస్తున్నారు.

కదిలించిన వార్త

ఆంధ్రజ్యోతి వార్తకు విజయనగరం ఎంపీతో పాటూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించారు. వివరాలు కనుక్కోమని డీఎస్పీ భక్తవత్సలాన్ని ఆదేశించారు. అలిపిరి సీఐ రామకిశోర్ రంగంలోకి దిగారు. సామాజిక సేవకురాలు సుజాత ద్వారా వెంకట్రావు ఉన్న ప్రదేశానికి ఉదయమే చేరుకున్నారు.వెంటనే రుయాస్పత్రికి తరలించారు.సుజాత అప్పటికే వెంకట్రావును శుభ్రం చేసి, ప్యాంటు చొక్కా వేశారు. వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. తన అక్క ఫోన్‌లో మాట్లాడిన తర్వాత వెంకట్రావులో చాలా మార్పు వచ్చింది. ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ఏర్పాటు చేసిన కారులో, ప్రసాద్ అనే కానిస్టేబుల్ సాయంతో మధ్యాహ్నం 2.20గంటలకు నెల్లిమర్లకు బయలుదేరారు.

నీ వల్లే బతికాను తల్లీ!

రుయాస్పత్రిలో నుంచి వెంకట్రావును బయటకు తీసుకువచ్చి కారులో ఎక్కిస్తున్న సమయంలో ఆయనకు నెలరోజులుగా అన్నంపెట్టి సేవ చేస్తున్న సుజాత కన్నీటి పర్యంతం అయ్యారు. ఆయన కూడా ఆమెను పట్టుకుని ఏడుస్తూ ఉండిపోయారు. 'నాయనా.. దారిలో ఏం తింటావో.. ఈ బిస్కెట్ తిను..' అంటూ ఆమె అతని నోటికి బిస్కెట్ అందించారు. 'నువ్వు నా తల్లివమ్మా.. నువ్వు లేకపోతే ఇక్కడ మిగిలేవాడిని కాదమ్మా' అంటూ వెంకట్రావు ఒక బిస్కెట్ తుంచి సుజాత నోట్లో పెట్టారు. ఆమెతో పాటూ ఇన్ని రోజులుగా అదే పేవ్‌మెంట్ మీద ఉంటున్న అనాథలు కొందరు కూడా వచ్చి ఆయనకు వీడ్కోలు చెప్పారు.



సుజాతకు బిస్కెట్ తినిపిస్తున్న వెంకట్రావు



కల్వర్టును ఢీ కొన్న కారు



లేమ (ఫైల్ ఫోటో)

తమ్ముడి పెళ్లికని అమెరికా నుంచి వస్తూ..!

- మామండూరు వద్ద అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న కారు
- డ్రైవరుతోపాటు ఎన్నారై మహిళ మృతి
- ఆమె భర్తకు తీవ్రగాయాలు



డ్రైవర్ రాజేష్(ఫైల్‌ఫొటో)



చికిత్స పొందుతున్న కార్తిక్

చంద్రగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ్ముడి వివాహం. చాలా కాలం తర్వాత సొంతగడ్డకు వస్తున్నామన్న ఆనందం. కుటుంబ సభ్యులు.. బంధుమిత్రులతో సరదాగా గడపొచ్చని భావించారు. అమెరికా నుంచి భర్తతో కలిసి ఇండియా వచ్చారు. మరో అరగంటలో ఇల్లు చేరతామనగా, కుక్క రూపంలో మృత్యువు తరుముకొచ్చింది. కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో లేమ(34), డ్రైవరు రాజేష్ దుర్మరణం చెందారు. ఆమె భర్త కార్తిక్ గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ విషాద ఘటన మంగళవారం చంద్రగిరి మండలం మామండూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి కరంబాడి రోడ్డులోని కేఆర్ నగర్‌కు చెందిన కార్తిక్, లేమ దంపతులు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. ఈనెల 13న లేమ తమ్ముడి వివాహం ఉంది. దీనికోసం వీరు అమెరికా నుంచి బయలుదేరి.. సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అద్దె కారులో తిరుపతికి బయలుదేరారు. మంగళవారం వేకువజామునకు మామండూరు వద్ద జాతీయ రహదారిలో వస్తున్న వీరి కారుకు ఓ కుక్క అడ్డంగా వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొంది. బెంగళూరుకు చెందిన కారు డ్రైవర్ రాజేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. బెలూన్ ఓపెన్ అయినా అతడి ప్రాణాలు దక్కలేదు. తీవ్ర గాయాలైన కార్తిక్, లేమను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే లేమ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్తిక్ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సందడిగా ఉండాల్సిన పెళ్లింట.. విషాదం నెలకొంది.

'ఇన్‌స్పైర్'కు పోటీ పడండి



ఇన్‌స్పైర్ మనక్-2025 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో, జిల్లా సైన్స్ అధికారి తదితరులు

- నామినేషన్లకు సెప్టెంబరు 15 గడువు

తిరుపతి(విద్య), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులకు సైన్సు, సాంకేతి రంగాలపై ఆసక్తి పెంచి.. శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డులతో ప్రోత్సహిస్తోంది. ఈ అవార్డులకోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీ పడాలి' అని డీఈవో కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ ఏడాది పోటీలకు నామినేషన్లను పంపేందుకు సెప్టెంబరు 15వ తేది తుది గడువన్నారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో 'ఇన్‌స్పైర్ మనక్- 2025' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతీ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుంచి 5, ప్లస్ టు పాఠశాలల నుంచి 2 చొప్పున నామినేషన్లు తప్పనిసరిగా పంపించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. నూతన పాఠశాలలు రిజిస్ట్రేషన్ యూజర్ ఐడీ కోసం జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌ను 94405 11983 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌరీశంకర్, తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, తడ ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్లు సుధాకర్, సారథి పాల్గొన్నారు.

❖ నిబంధనలు అతిక్రమించిన

నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలు

- ఇద్దరి సస్పెన్షన్..
  మరో ఇద్దరికి షోకాజ్ నోటీసుల జారీ

తిరుమల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించారంటూ నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలకు పూనుకుంది. ఇద్దరిని సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గతేడాది అక్టోబరు 2వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటనలో ఆలయ ప్రాంగణంలో తీవ్రమైన రద్దీ పెరిగి గందరగోళం నెలకొంది. సాధారణంగా ప్రముఖుల పర్యటన నేపథ్యంలో ప్రొటోకాల్ సిబ్బంది, అర్చకులు, మేళం సిబ్బంది, అటెండర్లు, పారిశుధ్య కార్మికులకు మాత్రమే కొన్ని ప్రాంతాల్లో విధులు కేటాయిస్తారు. అయితే కొందరు ఉద్యోగులు తమకు విధులు కేటాయించకపోయినప్పటికీ పవన్‌ను కలవాలని, చూడాలనే ఉద్దేశ్యంతో ఆలయంలోకి ప్రవేశించడంతో రద్దీ ఏర్పడిందని, ఇది భద్రతకు కూడా ఇబ్బంది తీసుకొచ్చే చర్య అంటూ విజిలెన్స్ విభాగం పేర్కొంది. ఈక్రమంలో శ్రీనివాసమంగాపురంలో విధులు నిర్వహించే బాలాజీ రంగకుమార్ అనే అర్చకుడితో పాటు తిరుపతి ఈఈ కార్యాలయంలో పనిచేసే చీర్ల కిరణ్ అనే జూనియర్ అసిస్టెంట్ క్రమశిక్షణ నిబంధనలు ఉల్లఘించి డిప్యూటీ సీఎంను అనుసరించారని నివేదికలో స్పష్టం చేసింది. దీంతో ఆలయంలోకి ప్రవేశించడానికి గల కారణాలు తెలియజేయాలని ఈ ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇక, తన ఇంటిని ఇతరులకు కేటాయించడంతో పాటు ఆర్థికలావాదేవీలు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆఫీస్ సబార్డినేట్ శంకర్‌ను, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారాలు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ రామును సస్పెండ్ చేస్తూ టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు ప్రయోజనాల కోసం పరిశోధించాలి

- తిరుపతి ఐసర్ స్నాతకోత్సవంలో సమీర్ సోమయ్య

ఏర్పేడు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మట్టిలోని జీవకణాలు, కార్బన్ మీద దృష్టి తగ్గిపోతున్న క్రమంలో అన్నదాతలతో కలిసి యువ శాస్త్రవేత్తలు పనిచేయాలని గోదావరి బయోరిఫైనరీస్ లిమిటెడ్, సోమయ్య విద్యావిహార్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ సమీర్ సోమయ్య పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి పరిశోధనలు ఉపకరించాలన్నారు. ఏర్పేడు సమీపంలోని ఐసర్‌లో మంగళవారం జరిగిన ఆరో స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. తాము పంచగవ్య, జీవామృతం వంటి సంప్రదాయక విధానాలను పరిశీలించి, శాస్త్రీయంగా పరిశోధించి వాటిని ఆధునిక పద్ధతులతో మిళితం చేస్తున్నామన్నారు. ఈ కృషి ఫలితంగా ఉత్తర కర్ణాటకలోని ఓ రైతు సగటున 30 టన్నులకు బదులుగా 120 టన్నుల చెరకు దిగుబడి సాధించారన్నారు. తమిళనాడులో పుట్టిన మణి అనే బాలుడు మేకను విక్రయించిన డబ్బుతో చదువును సాగించాడన్నారు. ఇప్పుడు బ్రౌన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఎదిగిన ఆయనతో కలిసి ప్రస్తుతం మన దేశంలోనే ఔషధ పరిశోధన కేంద్రాన్ని స్థాపిస్తున్నామని చెప్పారు. ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్ ఝిల్లు సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యవసాయం, సస్టైనబుల్ కెమిస్ట్రీ, సెమీకండక్టర్, ఎంజైమ్ తయారీ రంగాల్లో పరిశోధనలు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా రెండేళ్ల మాస్టర్ బై రీసెర్చ్(ఎంఎస్-ఆర్) కోర్సును ప్రారంభించనున్నట్టు డైరెక్టర్ శాంతను భటాచార్య వెల్లడించారు.



విద్యార్థి వినేష్ ముఖోపాధ్యాయకు గోల్డ్‌మెడల్ అందజేస్తున్న సమీర్ సోమయ్య,ఝిల్లు సింగ్ యాదవ్,శాంతను భట్టాచార్య

ఐసర్‌లో సందడిగా 'పట్టా'భిషేకం- 8లో



విజ్ఞాన దర్పణం సంస్కృత భాష

- ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు
- సంస్కృత వర్సిటీ భాషోత్సవ సదస్సులో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం

-8లో

27నుంచి కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. 27న వినాయక చవితితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.28న ధ్వజారోహణం ,హంస వాహన సేవ, 29న స్వర్ణ నెమలి వాహనం, 30న మూషిక వాహన సేవ, 31న స్వర్ణ శేషవాహన సేవలు, సెప్టెంబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహన సేవ, 2న గజ వాహన సేవ, 3న రథోత్సవం, 4న తిరుకల్యాణం, అశ్వ వాహన సేవ, 5న ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికారనంది వాహన సేవ, 7న రావణబ్రహ్మ వాహన సేవ చంద్ర గ్రహణం కారణంగా ఉదయం నిర్వహిస్తారు. 8న యాళి వాహన సేవ, 9న సూర్య ప్రభ వాహన సేవ, 10న చంద్ర ప్రభ వాహన సేవ, 11న కల్ప వృక్ష వాహన సేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి సేవ, 14న కామధేను వాహన సేవ, 15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



రామచంద్రాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కమ్మపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సౌజన్యంతో టీడీపీ అధికార ప్రతినిధి, తిరుపతి రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ వర్కింగ్ చైర్మన్ చిన్నబాబు ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి సామాగ్రిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ సుధాకర్‌నాయుడు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి దేవరాజులు, ఉమానాయుడు, కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉమాపతి పాల్గొన్నారు.

వసతి గృహంలో వసతుల కల్పనకు కృషి



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళాడిగ్రీ కళాశాలను మంగళవారం టీడీపీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరితో కలసి తరగతులకు వెళ్లి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. టీటీడీ కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. వసతిగృహంలో మరిన్ని సదుపాయాలు కల్పించాలని పలువురు విద్యార్థులు ఆయన్ను కోరారు. దీనిపై స్పందిస్తూ టీటీడీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వసతిగృహంలో సీట్ల పెంపుతోపాటు మెరుగైన వైద్యసదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

మనమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

భాకరాపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మనమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు భాగ్యలక్ష్మి సూచించారు. చిన్నగొట్టిగల్లులో వాట్సప్ గవర్నెన్స్‌పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ గవర్నెన్స్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా సర్టిఫికెట్లు, చెల్లింపులు వంటి వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్ద నుంచి పొందే అవకాశం ఉంది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సతీశ్, ఆర్ఐ జానకీరామ్, కార్యదర్శి వెంకటేశులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మఠం స్థలాన్ని పరిశీలించిన అధికారులు



ఇరువర్గాలతో మాట్లాడుతున్న హథీరాంజీ మఠం సూపరింటెండెంట్ కేశవులు, సిబ్బంది

తిరుపతిరూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ సర్వేనంబరు13 లోని హథీరాంజీ మఠానికి సంబంధించిన వివాదస్థలాన్ని మంగళవారం మఠంఅధికారులు సందర్శించారు. ఈస్థలంలో సోమవారం ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తిన నేపథ్యంలో మఠం సూపరింటెండెంట్ బి.కేశవులు నేతృత్వంలో సిబ్బంది పరిశీలించారు. అప్పటికే ఇరువర్గాల వారు చేరి స్థలంపై వాగ్వాదానికి దిగారు. అక్కడ చదును పనులను అధికారులు అడ్డుకున్నారు. . ఈభూమిని తమ పూర్వీకులకు సాగు చేసుకునేందుకు గతంలో మఠాధిపతులు లీజుకు ఇచ్చారంటూ తుమ్మలగుంటకు చెందిన ఓవ్యక్తి పేర్కొన్నారు. ఈభూమిలో రిజిస్ట్రేషన్లు చెల్లవనే న్యాయస్థానం తీర్పును సూపరింటెండెంట్ ప్రస్తావించారు. ఇందులోని ఎవరైనా ప్రవేశిస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. డాక్యుమెంట్లు ఉన్నవారు తమ కార్యాలయానికి వస్తే పరిశీలిస్తామన్నారు. దీంతో ఇరువర్గాల వారు వెనుతిరిగారు.

ఎమ్మెల్యే నానిని విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా

చంద్రగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధారెడ్డి దంపతులను విమర్శించే అర్హత లేదని చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్ బాషా అన్నారు. మంగళవారం చంద్రగిరిలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా చేసింది చెవిరెడ్డి సోదరుడు రఘునాథ్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ట్రాక్టర్ల యూనియన్ లీడర్‌గా దందాలు చేసింది మరిచిపోయారా అన్నారు. ఇసుక అక్రమ రవాణా చేయలేదని కాణిపాకంలో సత్యప్రమాణానికి సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఎమ్మెల్యే నాని నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కాదనం తగదన్నారు. పులివర్తివారిపల్లెలో జన్మించిన నాని గతంలో పాకాల మండలంలో సర్పంచ్‌గా ఐదేళ్లు సర్పంచ్‌గా చేసిన సంగతి తెలియకుంటే ఎలా అన్నారు. విష సంస్కృతిని ఎమ్మెల్యే నాని ప్రోత్సహించరన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, బాలకృష్ణమూర్తి, రాజులగారి వినోద్‌రెడ్డి, సక్కూరి ధనంజయరెడ్డి, పాల్గొన్నారు.

'ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి '

భాకరాపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లులో మంగళవారం ఆపార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, వైఎస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి, సహదేవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్, భూపాల్,మహేందర్‌రెడ్డి,డమరుకనాథగుప్తా, శ్రీనివాసులు, గురుశంకర, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ



చంద్రగిరి, పాకాల ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, పాకాల పంచాయతీ సర్పంచులు రూపారామ్మూర్తి, కస్తూరి ఆధ్వర్యంలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చంద్రగిరి పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాకాల పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌లు సిబ్బంది ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాలకు నేరుగా వెళ్లకుండా సేవలను వాట్సాప్ ద్వారా పొందవచ్చునన్నారు. 9552300009 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించి ప్రభుత్వ సేవలు పొందాలని సూచించారు. ఈకార్యక్రమాలలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యప్రభపై నీలకంఠేశ్వరస్వామి రాజసం



శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి మంగళవారం సూర్యప్రభ వాహనంపై గ్రామంలో విహరించారు. ముందుగా స్వామిఅమ్మవార్లకు ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామిఅమ్మవార్లు సూర్య ప్రభ వాహనంపై గ్రామంలో ఊరేగారు.

అమ్మవారి సేవలో కర్ణాటక హోంమంత్రి



పరమేశ్వర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుచానూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏఆర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు మంత్రి పరమేశ్వర్‌కు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల మంత్రి పరమేశ్వర్‌ను గౌడ పేడు చిట్టిబాబు, శివశంకర్, మురళీకృష్ణ, మల్లికార్జున తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని మహిళ మృతి



పాకాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తూ జారి పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన దామలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలోని తోట తిమ్మయ్యగారిపల్లె పంచాయతీ వలపలవారిపల్లె వద్ద మంగళవారం ఉదయం జరిగింది. మృతురాలికి 45 ఏళ్ల వయసుంటుంది. ఎలాంటి గుర్తింపు కార్డు లభించలేదు. చేతిపై రామక్క, పార్వతి అనే పేర్లతో పచ్చబొట్టు ఉంది. చిలకపచ్చ రంగు చీర పింక్ కలర్ రవిక ధరించి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ హుండీలో చోరీ



బొంతల గంగమ్మ గుడి హుండీ

పాకాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాకాల-నేంద్రగుంట రోడ్డు కిరణ్‌గారుపల్లె సమీపంలోని బొంతల గంగమ్మ గుడిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీ పగులగొట్టారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించారు. వారు పోలీసులు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు ఐదారు వేల రూపాలయలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మున్నెయ్య (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమాల గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పేరువాయి మున్నెయ్య(50) మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ అమర్చు తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పశువుల కాపరి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంటలో పడి...



చంద్రబాబు (ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామం సమీపంలోని శివాలయం వద్ద ఉన్న నీటి గుంటలోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ నాగబాబు తెలి పిన వివరాల మేరకు... నాయుడుపేట మండలం వేముగుంటపాళెం గ్రామానికి చెందిన చంద్రబాబు(42) వాకాడు మండలంలోని కల్లూరులో వివాహం చేసుకుని, అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం గ్రామానికి సమీపంలోని నీటి గుంటలో మృతదేహం తేలియాడుతుండగా గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలిం చారు. పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో కుప్పకూలి అసోంవాసి మృతి

గూడూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య వివరాల మేరకు... అసోం రాష్ట్రం డింగ్‌డింగా గ్రామానికి చెందిన రూపక్‌రాయ్(23) మంగళవారం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నుంచి బయటకు వస్తుండగా ఆర్చీ వద్ద కూర్చొని సొమ్మసిల్లిపోయాడు. స్థానికులు గమనించి 108 స్పందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డుతో అస్సాంవాసిగా గుర్తించారు. అతని పర్సులో లభ్యమైన ఫోన్ నంబరుకు కాల్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, రూపక్‌రాయ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, పరిస్థితి విషమించి మృతి చెంది ఉంటాడని చెప్పారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

కోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేశవరం పంచాయతీ పరిధిలోని రామవాపురంలో ఇద్దరి మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన రహీముల్లా అదే గ్రామానికి చెందిన అనిల్‌కు కొంత నగదును అప్పుగా ఇచ్చాడు. మంగళవారం బాకీ విషయమై అనిల్‌ను రహీముల్లాను నిలదీశాడు. దీంతో అనిల్, శ్రీనివాసులు కలిసి ఇంట్లో ఉన్న రహీముల్లాపై దాడి చేశారు. తీవ్రంగా గాయ పడిన రహీముల్లాను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇద్దరిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు

● రేపు పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద వ్రత టిక్కెట్ల విక్రయం



మాడ వీధుల్లో రంగవల్లులు



ముస్తాబైన ఆస్థాన మండపం (వ్రత వేదిక)

తిరుచానూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పద్మావతి దేవి ఆలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈక్రమంలో ఆలయ ప్రాంగణం, మాడవీధుల్లో రంగవల్లులు, విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా మారాయి. వ్రత వేదిక అమ్మవారి ఆస్థాన మండపాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా వ్రతం జరగనుంది. సుమారు 1,100 మంది భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు నాలుగు రోజుల క్రితమే 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విక్రయించారు. మిగిలిన 150 టిక్కెట్లను గురువారం ఉదయం 10గంటలకు అమ్మవారి కుంకుమార్చన కౌంటరులో విక్రయించనున్నట్లు డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తెలిపారు. మరో 150 టికెట్లను టీటీడీ అధికారులు విచక్షణ కోటా కింద అందజేయనున్నారు. శ్రావణ శుక్రవారం నాడు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరానుందున పటిష్ట క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బయట కూడా భక్తులు వ్రతాన్ని వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు పెడుతున్నారు. పసుపుదారాలు, కుంకుమ, కంకణాలు, గాజులు, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తకం వంటి పవిత్ర సామగ్రిని అందించేందుకు టీటీడీ ఇప్పటికే ఏర్పాట్లు చేసింది.

ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కె.బిందు-కె.యమున-కె.వి.సుధీర్ -ఎస్ రేవతి

చంద్రగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్వీ యూనివర్శిటీ స్థాయిలో అత్యున్నత ప్రతిభను కబరిచారు. ఇటీవల ఎస్వీయూ విడుదల చేసిన ఫలితాల్లో మొదటి సంవత్సరం సెమిస్టర్ (డిసెంబర్-2024) ఫలితాల్లో బీకామ్ (కంప్యూటర్స్), బీబీఏ, బీసీఏ(ఏఐ), బీసీఏ(డీఎ)లో ఈ కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో ప్రతిభను కనబరిచారు. బీకామ్ కంప్యూటర్స్‌లో కొమరోలు వెంకట సుధీర్ (8.80), గువ్వల హేమలత(8.60), బుక్కే కవింద్రనాయక్(8.60), బీబీఏలో సింగల్ల రేవతి(8.55), వల్లం సంతోష్(8.35), షేక్ అమాన్ అఫ్రీన్(8.20), బీసీఏలో కంచువారి బిందు(9.60), టెన్నిటి రంజిత(8.80), చేరుకూరు కోకిల(బీసీ(డీఎస్)లో కలత్తూరు యమున, సునీల్‌కుమార్‌లు(8.75), తిరుమల మాధవి,వడ్డే సునీల్‌కుమార్((8.75శాతం) మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు అభినందించారు.

ప్రభుత్వానికీ వెసులుబాటు కల్పిద్దాం

● అనుగుణమైన మార్పులకు అంగీకరిద్దాం

● 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమంలో ఉద్యోగులు



రీజనల్ ట్రైనింగ్ అండ్ స్టాటిస్టికల్ సెంటర్‌లో ఉద్యోగుల మాటా మంతీ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన వేతన, పింఛను బాకయిలను చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, మనవంతుగా ప్రభుత్వానికి కొంత వెసులుబాటు కల్పిందామంటూ ఉద్యోగ సంఘం నాయకులు చర్చించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం తిరుపతిలోని రీజనల్ ట్రైనింగ్ అండ్ స్టాటిస్టికల్ సెంటర్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదలను చేశారు. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఆర్థిక బకాయిలు చెల్లించలేనందున ఆయా బకాయిలను ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లలో నమోదుచేయాలని కోరారు. పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి ప్రత్యేక బాండ్లు జారీచేసి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యోగుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలని, అందుకు ప్రభుత్వ రేటుకు గృహస్థలాలు మంజూరుచేసి, గృహనిర్మాణ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలు ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వానికి కూడా ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. ప్రతిపాదనలపై ప్రభుత్వంతో చర్చిద్దామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్‌కుమార్, బాలాజీరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఇతర కార్యవర్గం సభ్యులు వీఆర్వో అసోసియేషన్ నాయకులు చెంగల్రాయులు, ఏఎస్ఓ మధు, నారెడ్డి కిరణ్, దుర్గాప్రసాద్, అరుణమ్మ, మధవరావు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి ఐసర్ ఆరో స్నాతకోత్సవం మంగళవారం ఉత్సాహ వాతావరణంలో జరిగింది. విద్యార్థులు సందడి చేశారు. ఐదేళ్ల డిగ్రీ కోర్సు పూర్తి చేసి పట్టాలందుకుంటున్న తరుణంలో వీరంతా పరస్పరం సంతోషాన్ని పంచుకున్నారు. కొందరు స్టెప్పులు వేస్తూ సహచరులను అలరించారు.

ఉత్తరాఖండ్ సీఎంకు సాదర స్వాగతం



ఉత్తరాఖండ్ సీఎంకు స్వాగతం పలుకుతున్న జేసీ తదితరులు

రేణిగుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామీకు సాదర స్వాగతం లభించింది. మంగళవారం మ ధ్యా హ్నం ఇండిగో విమానంలో ఢిల్లీ నుంచి తిరుపతి విమానా శ్రయం చేరుకున్న ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, బీజేసీ రాష్ట్ర కార్యదర్శి కోలాఆనంద్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అలాగే సిక్కిం రాష్ట్ర సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్‌కు సాదర స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో చేరుకున్న ఆయనకు ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

రైల్వే ట్రాక్‌పై మృతదేహం

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని 86వ కిలోమీటరు సమీపాన అప్ లైన్ రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడుందన్న స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు నేర స్థలాన్ని పరిశీలించారు. మృతుడు శివజ్యోతి నగర్‌కు చెందిన పసుపులేటి వెంకటరమణగా గుర్తించారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రైలు కింద పడి చనిపోయినట్లు భావిస్తున్నారు. తిరుపతి రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేశారు.

స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి పోలీస్ పరేడ్ మైదానం వేదికగా ఆగస్టు 15న 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఎస్పీ హర్షవర్ధనరాజుతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆనాటి కార్యక్రమాల అజెండాను అధికారులకు వివరించారు.

ఆయా శాఖల అధికారులకు నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివిధ శాఖల శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మరాజస్వామికి పట్టువస్త్రాల సమర్పణ




పట్టువస్త్రాలతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్/ పుత్తూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్రౌపది సమేత ధర్మరాజస్వామి తిరునాళ్లలో భాగంగా స్వామి అమ్మవార్ల వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళవారం కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని కాపు వీధి మీదుగా ద్రౌపది దేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మున్సిపాలిటీ తరపున మున్సి పల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సారెను సమ ర్పించారు. ఆయా కార్యక్రమాల్లో చినబాబు, గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డి, అమ్ములు, యుగంధర్, జీవరత్నం నాయుడు, డీఎస్ గణేష్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి రోజా కూడా అమ్మవారి కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

● మృతి చెందిన తల్లి, కుమారుడు, మనవడు



ధ్వంసమైన కారు - శ్రీకాంత్, లక్ష్మీదేవి మృతదేహాలు

తవణంపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని ఎలాక్ట్రానిక్ సిటీకి చెందిన శ్రీకాంత్(34) తన తల్లి లక్ష్మీదేవి(55), కుమారుడు శ్రీయాన్(3)తో కలిసి తిరుమలేశుడిని దర్శించుకుని కారులో మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రానికి తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిపై తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపాన ఉన్న నయారా పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులోని శ్రీకాంత్, లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడ్డ శ్రీయాన్ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అంకాలమ్మ గుడికి ఉత్సవ విగ్రహం అందజేత



ఉత్సవ విగ్రహాన్ని అందిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ దంపతులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని గ్రామదేవత అంకాలమ్మ గుడికి తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ.మునికృష్ణ దంపతులు మంగళవారం ఉత్సవ విగ్రహాన్ని అందించారు. అమ్మవారిపై ఉన్న భక్తితో ఉత్సవ విగ్రహాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీధర్, మహేష్ యాదవ్, సుబ్బుయాదవ్, రవితేజ, నాగప్రతాప్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రామకృష్ణమిషన్ ఆశ్రమ వార్షికోత్సవం



మాట్లాడుతున్న భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు

తిరుపతి అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మిషన్ ఆశ్రమం దశమ వార్షికోత్సవం మంగళవారం జరిగిన పురుషుల యువజన సమ్మేళనంతో ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సనాతనమైనదని అందరూ కలసి జీవించాలని చెబుతుందన్నారు. స్వామి సుకృతానందజీ మాట్లాడుతూ ఆశ్రమ కార్యక్రమాలను దేశవ్యాప్తంగానే కాకుండా శ్రీలంక, బంగ్లాదేశ్‌లలోనూ జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, స్వామిహృదానందజీ, స్వామిశితికంఠనందజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ సీఎంకు ఆత్మీయ స్వాగతం



పుష్కర్ సింగ్ ధామికి స్వాగతం పలుకుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి మంగళవారం తిరుపతికి చేరుకున్నారు. స్థానిక గ్రాండ్ రిడ్జ్ హోటల్ వద్ద టీటీడీ బోర్డు మెంబర్, బీజేపీ సీనియర్ నేత భానుప్రకాష్‌రెడ్డి ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి శ్రీవారి జ్ఞాపికను అందజేశారు.

పేదలకు అండగా సీపీఐ



సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మురళిని అభినందిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారికి తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి వెల్లడించారు. తిరుపతి బైరాగిపట్టెడలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సూళ్లూరుపేటలో జరిగిన పార్టీ జిల్లా మహాసభలు విజయవంతమయ్యా యన్నారు. అనంతరం జరిగిన జిల్లా కార్యదర్శి ఎన్నికల్లో పి.మురళిని రెండవ సారి పార్టీ ఎంపిక చేసిందని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎ.రామానాయుడు, చిన్నం పెంచలయ్య, కె.రాధాక్రిష్ణ, జె.విశ్వనాథం, సిహెచ్.ప్రభాకర్, బి.నదియాతో పాటు 8 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. అనంతరం 15 అంశాలతో తీర్మానాలను వారు ప్రకటించారు. కాగా అంతకుముందు జిల్లా కార్యదర్శి మురళిని ఆ పార్టీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.

శ్రీవారి మెట్టు చిరువ్యాపారులకు న్యాయం చేయండి



టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకులు, తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు చిరువ్యాపారులకు టీటీడీ పాలక మండలి, అధికారులు న్యాయం చేయాలని సీపీఎం, ఇతర సంఘాల నాయకులు కోరారు. టీటీడీ పరిపాలన భవనం ఎదుట 350 రోజులుగా దీక్షలు చేస్తున్న వ్యాపారులకు మంగళవారం సీపీఎం, ఆర్‌పీఐ, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు కందారపు మురళి, పి.అంజయ్య, ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పరసారత్నం, అవధాని ఆముదాల మురళి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, మధు, చిట్టిబాబు, ప్రకాష్, రామమూర్తి, చిరంజీవి, రాంబాబు, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హంస రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజా



రాజాను సన్మానిస్తున్న పలు యూనియన్ నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజాను నియమిస్తూ ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తిరుపతిలోని ఏపీ హంస యూనియన్ భవనంలో పలువురు యూనియన్ నేతలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. పలువురు ఉద్యోగులు, యూనియన్ నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ఇటువంటి అవకాశం లభించడం సంతోషకరమన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(విద్య), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం సహాధ్యక్షులు గోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రిటైర్ అయినవారికి గ్రాట్యుటీ, పెన్షన్ సకాలంలో అందడంలేదని పేర్కొన్నారు. దీంతో పెద్ద వయసులో అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో మంగళం రూరల్ సెక్షన్ పరిధిలో తెలుగు గంగ నీరు నగరానికి సరఫరా నిమిత్తం నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మంగళం రూరల్ ప్రాంతాల్లో తెలుగు గంగ పైపు లైను మార్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలియజేశారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నులిపురుగుల నిర్మూలనపై అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి మాట్లాడుతూ పిల్లలకు ఏ మందులు, ఎంత మోతాదు, ఏ సమయంలో వేయాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్వాడీలకు సూచించారు. ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మాలన దినోత్సవం పురస్కరించుకొని వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మురళి, పీహెచ్‌ఎన్ బేబీ రాణి పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్‌మాల్‌కు కేటాయిస్తే ఆందోళనలు తప్పవు



మాట్లాడుతున్న ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఈయూ నాయకులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఏపీఎస్ ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్ పేట- 1, 2 డిపోలు, పాత బస్టాండుకు సంబంధించిన 4.15 ఎకరాలను లులూ షాపింగ్‌మాల్‌కు ప్రభుత్వం కేటాయించడం తగదన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు రవాణా సౌకర్యాలు, అందిస్తూ అందుబాటులో ఉన్న ఈ రెండు డిపోలని 200 బస్సులు, 1100మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేస్తే బడా వ్యాపారులకు జీవో నెంబరు 137 ద్వారా కట్టబెట్టిన జీవోను రద్దు చేయాలన్నారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఈ బస్సులను ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ప్రవేశపెడుతూ వారికి ఆర్టీసీ డిపోలను అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్జున, కుమార్, మురగమ్మ, జీఆర్ చంద్ర, మస్తాన్, సుబ్బు, ఎన్‌ఎస్ మణ్యం, బీటీ బాబు, ఏబీఎస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ఘనంగా నిర్వహిద్దాం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, సమావేశానికి హాజరైన ఉత్సవ కమిటీ సభ్యులు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిషేధం
- నిమజ్జన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి (కలెక్టరేట్): ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. వినాయక ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాలపై ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి ఉత్సవ కమిటీ, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన అతి భారీ విగ్రహాలను నిషేధించాలన్నారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టణంలో ఆర్చీలు, విద్యుత్ దీపాలంకరణ, అరటి తోరణాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వినాయకసాగర్, దామినేడు నిమజ్జన ప్రాంతాల్లో నీటి నిల్వ తగినంత ఉండేలా చర్యలు తీసుకో వాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మండపాల్లో భక్తి పాటలు మాత్రమే వినిపించాలని, ఎలాంటి అశ్లీలత, సినీగీతాలు పెట్టరాదన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో నగరంలో వినాయక చవితి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ వినాయకసాగర్‌తో మరో మూడు చెరువుల్లో వినాయక నిమజ్జనం జరుగుతుందన్నారు. 50 అడుగుల నృత్య గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, కమిటీ నిర్వాహకులు సామంచి శ్రీనివాస్, ఆర్‌సీ మునికృష్ణ, నరసింహ యాదవ్, గోపీనాథ్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తేలని సరిహద్దు సమస్య.. పేరుకుపోతున్న చెత్త

తిరుపతి అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ, మంగళం క్వార్టర్స్ సచివాలయాల సరిహద్దుల కేటాయింపులు ఖచ్చితంగా లేకపోవడంతో పలుచోట్ల చెత్త పేరుకుపోతోంది. చెత్త తొలగింపుపై రోజూ పారిశుధ్య కార్మికుల మధ్య వివాదం చోటుచేసుకుంటోంది. ఆర్టీవో కార్యాలయం పక్కరోడ్డు మొదట్లోనే బ్రిడ్జికి వున్న మ్యాన్‌హోల్ ధ్వంసమై దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. వాహనచోదకులకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో బారికేడ్ ఏర్పాటుచేశారే తప్ప శాశ్వత పనులు చేపట్టలేదు. అదే వీధిలో తరచూ చెత్త పేరుకుపోతోంది. హద్దులు తేల్చి బాధ్యతలు అప్పగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య సంవత్సరాలుగా పరిష్కారం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.





మంగళం, సప్తగిరి కాలనీ సరిహద్దు వీధుల్లో మధ్యాహ్నం దాటినా పేరుకున్న చెత్త, ఆర్టీవో కార్యాలయం పక్కవీధి మలుపులో మ్యాన్‌హోల్ లేక బారికేడ్ ఏర్పాటు చేసున్న దృశ్యం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య పేర్కొన్నారు. నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో మహిళా సంఘాలలోని స్టార్ పెర్ఫార్మర్ మహిళలకు లీప్ ఒకరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఇందులో కమిషనర్ మాట్లాడుతూ ఒక కుటుంబం - ఒక వ్యాపారస్తుడు అనే నినాదంతో ప్రతి సంఘంలో ఒక మహిళను వ్యాపారస్తురాలిని చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి పని చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే మెప్మా ఎస్.ఎం.ఈ ఫోరంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలలో అత్యున్నత ప్రమాణాలతో వ్యాపారం చేస్తున్న వారిని స్టార్ పెర్ఫార్మర్‌గా గుర్తించామని వీరి వ్యాపారాన్ని మరింత మెరుగుచేసేందుకు అవసరమైన అవకాశాలు, నైపుణ్యాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రీటైల్, టెక్స్‌టైల్, ఫుడ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఫర్నిచర్ అండ్ ఉడ్ ప్రొడక్ట్స్ వంటివాటిలో మహిళా వ్యాపారవేత్తలు గ్లోబల్ స్థాయికి ఎదిగేందుకు ఆచరణాత్మక నైపుణ్యాలు, సెక్టార్-నిర్దిష్ట చర్చలు, నిపుణుల మెంటర్‌షిప్ తదితర అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని వెల్లడించారు. ఎన్.యు.ఎల్.ఎం. డైరెక్టర్ సునీల్ కుమార్ యాదవ్ మహిళలతో ముఖాముఖి చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనతరం స్టార్ పెర్ఫార్మర్లకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లీప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భవ్యశర్మ, ప్రాజెక్ట్ హెడ్ షీలా శ్రీనివాస్ ప్రాజెక్టులు, దరఖాస్తు చేసుకునే విధానం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పథక సంచాలకులు రాఘవరెడ్డి, సి.ఎం.ఎం.లు కృష్ణవేణి, సోమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ విద్యార్థుల హాస్టల్ సమస్యను పరిష్కరిస్తాం

తిరుపతి(విద్య), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు హాస్టల్ వసతి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టీటీడీ ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన పద్మావతి మహిళా జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో సీట్లు రాక ఇబ్బందులు పడుతున్నామని పలువురు విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా బాలగంగమ్మ జాతర



తిరుపతి అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మంగళం క్వార్టర్స్ పంచాయతీ పరిధిలోని నారా చంద్రబాబునాయుడు కాలనీలో మంగళవారం బాలగంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నివేదన, పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. రాత్రి ముగింపు ఉత్సవం కోలాహలంగా సాగింది.



ఎస్వీయూ స్పోర్ట్స్ అరేనాకు నూతన హంగులు



మెయిన్ రోడ్డువైపు ఏకాగ్రత దెబ్బతినకుండా నిర్మించిన గోడ

తిరుపతి (క్రీడలు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలోని ప్రకాశం భవనం పశ్చిమ దిశలో ఉన్న స్పోర్ట్స్ అరేనాకు నూతన హంగులతో కళకళలాడుతోంది. ఈ గ్రౌండ్ టెన్నీస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలకు చక్కటి వేదికగా ఉంటోంది. ఎస్వీయూ స్టూడెంట్స్ ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులు, నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ నిత్యం ఉదయం 6నుంచి 8వరకు, సాయంత్రం 4నుంచి 6గంటల వరకు ఇక్కడ ప్రాక్టీస్ చేస్తుంటారు. అలాగే ఆన్‌పేమెంట్స్ ద్వారా కొన్ని టోర్నీలు కూడా జరుగుతుంటాయి. అయితే గ్రౌండ్‌కు దక్షిణాన వున్న గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో ప్లేయర్స్‌కు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పక్కనే నాలుగు లేన్ల రహదారిలో వాహనాల రాకపోకలతో ఏకాగ్రత కోల్పోతున్నారు. అదుపుతప్పిన బాల్స్ రోడ్‌వైపు దూసుకెళ్తున్నాయి. విపరీతమైన శబ్దం, వాహనాల నుంచి వచ్చే పొగతో కాలుష్యం వంటి సమస్యలు తలెత్తేవి. క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎస్వీయూ యాజమాన్యం అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు రూ. 5లక్షల మేర నిధులు కేటాయించింది. 132 అడుగుల పొడవు, 9 అడుగుల ఎత్తు, 9 అంగుళాల మందంతో సిమెంట్ గోడను నిర్మించి రంగులు వేశారు. చుట్టూ ఇనుపకంచెకు మరమ్మతులు చేపట్టి రంగులు అద్దారు. అలాగే మైదానం ఫ్లోరింగ్, గ్యాలరీ, గదులకు సైతం మరమ్మతులు చేపట్టి పెయింటింగ్ వేశారు. దీంతో ఆ గ్రౌండ్ కళకళలాడుతోంది. పలువురు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూతనంగా నిర్మించిన టెన్నిస్ కోర్టు

రుయాలో 40 రోజుల బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స




కోలుకున్న పురిటిబిడ్డతో తల్లిదండ్రులు, సర్జరీ చేసిన వైద్యులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కిందపడటంతో తలలో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమంగా ఉన్న 40 రోజుల పురిటి బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టామని తిరుపతిలోని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ జయచంద్ర నాయుడు తెలిపారు. దీనిపై మంగళవారం ఆయన రుయాస్పత్రిలో అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'వెంకటగిరికి చెందిన స్వాతి, రఘు దంపతుల 40 రోజుల పాప చేతిలో నుంచి కింద పడటంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. తలలో రక్తం గడ్డ కట్టింది. దీంతో మూర్ఛవ్యాధి కూడా వచ్చి పాప అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే ఆ పురిటిబిడ్డను తల్లిదండ్రులు రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి నిపుణులైన న్యూరోసర్జరీ వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ అనంతకుమార్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్, అనస్థీషియా వైద్యులు డాక్టర్ రాధ, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రీనివాసుల సాయంతో చిన్నారికి అతిక్లిష్టమైన శస్త్ర చికిత్సను నిర్వహించి చిన్నారి ప్రాణాలు నిలబెట్టారు. ప్రస్తుతం చిన్నారి పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశాం' అని చెప్పారు. వైద్య బృందానికి చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన్నర కిలో గంజాయి స్వాధీనం

తిరుచానూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ దామినేడు హౌసింగ్ కాలనీలో మణి, భరత్‌ను అరెస్టు చేసి ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఓ వివాహితపై మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడిన కార్తీక్‌కు వీరు స్నేహితులు. దీంతో ఈ హౌసింగ్‌కాలనీలో సంఘ విద్రోహశక్తులు పెరిగిపోయారు. ఫలితంగా పలు నేరసంఘటనలు జరుగుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కార్డన్ సెర్చ్ నిర్వహించి నేరస్థులను కట్టడిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.21 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,928

తలనీలాలు సమర్పించినవారు: 29,297



ఐసర్‌లో సందడిగా

- 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- క్యాంపస్‌లో వెల్లివిరిసిన ఉత్సాహం

పట్టాభిషేకం



ఫొటో పాయింట్



చివరగా ఓ సెల్ఫీ

భావోద్వేగాల నడుమ వీడ్కోలు

తిరుపతి ఐసర్‌లో తమ చదువు ముగించి పట్టాలందుకున్న విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు.కొందరి కళ్లలో సన్నటి కన్నీటి పొర తొంగిచూసింది. విద్యాసంస్థను వీడిపోతున్నామనే బాధను దిగమింగుకుంటూ విద్యార్థులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఐదేళ్ల పాటు కలిసి చదువుకుని, శాస్త్రీయ పరిశోధనల్లో మేటి అనిపించుకున్న వీరంతా ఆటోగ్రాఫ్‌లు ఇచ్చుకుంటూ ఒకరికొకరు వీడ్కోలు పలికారు.

ఏర్పేడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐసర్ ఆరో స్నాతకోత్సవం ఆనందోత్సాహాలకు వేదికైంది. మంగళవారం ఉల్లాస వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. పట్టాలను అందుకుంటూ పట్టరాని సంతోషాన్ని పంచుకున్నారు. కేరింతలు కొట్టారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గోదావరి బయో రీఫైనరీస్ చైర్మన్, విద్యా విహార్ యూనివర్శిటీ చాన్సలర్ సమీర్ సోమయ్య హాజరయ్యారు. ముందుగా ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య చేతుల మీదుగా 255 మంది విద్యార్థులకు డిగ్రీలను అందుకున్నారు. సమీర్ సోమయ్య, బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఖిల్లుసింగ్ యాదవ్, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్యలు వివిధ రంగాల్లో, విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, రజత పతకాలను ప్రదానం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ కోహ్లి, జాయింట్ రిజిస్ట్రార్ రమేష్, డీన్లు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టిల్ అదిరిపోలా..!



పట్టాల పండుగలో సందడి

స్నాతకోత్సవానికి 255 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్నేహితులు ఉత్సాహంగా హాజరయ్యారు. 22 పీహెచ్‌డీలు, 8 సమగ్ర పీహెచ్‌డీలు, 3 ఎంఎస్ డిగ్రీలు, 141 ఫ్లాగ్‌షిప్ డీఎస్ ఎంఎస్ డిగ్రీలు, 69 ప్రొఫెషనల్ మాస్టర్ డిగ్రీలు, 6 డీఎస్ డిగ్రీలు, 6 డీఎస్సీ డిగ్రీ పట్టాలను విద్యార్థులు అందుకుంటున్నప్పుడు హాలు కరతాళధ్వనులతో మారుమోగింది. కొంతమంది విద్యార్థులు డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ కోహ్లీతో కలిసి ఉత్సాహం పంచుకున్నారు.



స్నాతకోత్సవానికి హాజరైన బోర్డ్ ఆఫ్ గవర్నర్ సెనేట్ కమిటీ సభ్యులు

భవిష్యత్ శాస్త్రీయశక్తిగా తిరుపతి ఐసర్

తిరుపతి ఐసర్ భవిష్యత్ శాస్త్రీయ ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మారిందని, ఐసర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య చెప్పారు. స్నాతకోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో తమ విద్యాసంస్థ శాస్త్రీయ శక్తిగా ఎదుగుతుందన్నారు ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలకు శాస్త్రీయ దీపకాంతిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 210 పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ప్రకారం తిరుపతి ఐసర్ దేశంలోన్ని 33వ ర్యాంకు సాధించిందన్నారు. స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో టాప్ 2 పర్సెంట్ శాస్త్రవేత్తల్లో 8మంది తిరుపతి ఐసర్ ఫ్యాకల్టీ ఉన్నారన్నారు. ఈ యేడాది నుంచి ఎంఎస్ రీసెర్చ్, డీఎస్ ఇన్ ఎకనామిక్స్, స్టాటికల్ సైన్స్(బీసీ-ఈఎస్ఎస్)కు శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతి ఐసర్‌లో విద్యార్థులకు ఇంటిని మర్చిపోయే వాతావరణముందన్నారు. అత్యాధునిక సదుపాయాలు కల్పించామన్నారు. రూ.9 కోట్లతో క్రికెట్ స్టేడియాన్ని మల్టీపర్పస్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

బిడ్డతో హాజరైన విద్యార్థిని

కేరళకు చెందిన డోనామారియా ఐసర్‌లో ఐదేళ్లు చదివింది. స్నాతకోత్సవానికి భర్త ప్రవీణ్, రెండు నెలల చిన్నారితో కలిసి హాజరై పట్టాను అందుకుంది. ఆమెను పలువురు అభినందించారు.



అవార్డులు అందుకున్న వారు వీరే

తిరుపతి ఐసర్‌లో విశేషప్రతిభ కనబరిచిన కొందరు విద్యార్థులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. డీఎస్ ఎంఎస్ ప్రోగ్రాంలో హనీఫ్ ముఖోపాధ్యాయ్(బంగారు పతకం) మ్యాథమెటిక్స్‌లో ఆర్‌సీ విష్ణు ప్రశాంత్(రజతం), డీఎస్ఎంఎస్‌లో ఆర్.విఘ్నేశ్వరన్(సిల్వర్) బీఎస్ఎంఎస్ ప్రోగ్రాంలోఆస్మా చిరుణి(బెస్ట్ గ్రాడ్యుయేటింగ్ స్టూడెంట్), అర్జిత్ శంకర్ బెనర్జీ (బెస్ట్ స్టూడెంట్ క్యాంపస్) పురస్కారాలు పొందారు.





సిల్వర్ మెడల్ అందుకుంటున్న విఘ్నేశ్వరన్, ఆర్‌సీ విష్ణుప్రశాంత్.. మరో రెండు విభాగాల్లో అవార్డు తీసుకుంటున్న టి.అస్మాషిరిన్, అర్జిత్ శంకర్ బెనర్జీ



బెస్ట్ బేబీ అవార్డు అందుకుంటున్న తల్లి నాగలక్ష్మి

తల్లిపాలతో శిశువుకు పరిపూర్ణ ఆరోగ్యం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నవజాతశిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం చాలా శ్రేయస్కరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఇచ్చే తొలి టీకా అన్నారు. కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలని సూచించారు. తల్లిపాలలో అనేక పోషకాలు బిడ్డలకు లభిస్తాయన్నారు. గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయాల్సిన బాధ్యత ఆశా వర్కర్లపై కూడా ఉందన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఐవో శాంతకుమరి, ప్రొఫెసర్ అరుణ, టాటాట్రస్టు మేనేజరు సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ బేబీ అవార్డును తల్లి నాగలక్ష్మికి అందజేశారు.

ఆల్బెండజెల్ మాత్రలను పంపిణీ చేయండి

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజెల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అధికారులతో సమక్షించారు. ఆగస్టు 12న జరిగే జాతీయ డీవార్మింగ్‌డేను పురస్కరంచుకుని పిల్లలందరి ఆల్బెండజెల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. ఆరోజు ఎవరైన లేకపోతే 20న పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' అవినీతిలో నిర్లక్ష్యం

- ముగ్గురు సిబ్బంది సస్పెన్షన్

రామచంద్రాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.2.29లక్షల మేర అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బహిరంగ సభలో తేలింది. అలాగే విధులు సక్రమంగా నిర్వర్తించని ముగ్గురు సిబ్బంది సస్పెండయ్యారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. అత్యధికంగా సి.కాలేపల్లి, గంగిరెడ్డిపల్లి పంచాయతీల్లో రూ.31 వేలు అవినీతి చోటు చేసుకోగా అత్యల్పంగా సి.రామాపురంలో రూ.946 అవినీతి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధి హామీలో అవకతవకల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సాంకేతిక సహాయకులు సుదర్శన్, బేర్‌ఫుట్ ఇంజనీర్ రమేష్, జూనియర్ ఇంజనీర్ మమతలను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు ఎంపీడీవో ఇందిరమ్మ, ఏపీడి టి చిన రెడ్డప్ప, డీఆర్‌డీఏ ఏపీడి ప్రభావతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి, ఏఈఈ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తూ అనంతలోకాలకు..

- ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుడు ఆంధ్రజ్యోతిలో ఏసీవో
- నాయుడుపేటలో విషాదం





ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు - మృతుడు రాజేంద్ర(ఫైల్)

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్)/నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం చేసుకున్నామన్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు. భోజనం కోసం ఓ హోటల్ వద్ద ఆగిన వారి కారును మరో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపం సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధితు కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పూల రాజేంద్ర (41) ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ విభాగంలో (ఏసీవో) పని చేస్తున్నారు. తన నలుగురు స్నేహితులతో కలిసి కారులో నాయుడుపేట నుంచి శ్రీశైలంకు వెళ్లారు. అక్కడ దైవదర్శనం అనంతరం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో ఓ హోటల్ వద్ద సోమవారం రాత్రి భోజనం కోసం ఆగారు. ఇద్దరు కారులో నుంచి కిందకు దిగగా, మరో ముగ్గురు కారులోనే ఉన్నారు. అంతలో దుత్తలూరు వైపు నుంచి వేగంగా వెళ్తున్న మరో కారు ఢీకొంది. దీంతో కారులో ఉన్న రాజేంద్రతోపాటు చెందేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించగా, అప్పటికే రాజేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో సహా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా మంగళవారం రాజేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేంద్ర స్వస్థలం చిత్తూరు జిల్లా నింద్ర మండలం కావనూరు గ్రామం కావడంతో మృతదేహాన్ని ఆ గ్రామానికి తీసుకెళ్లారు. ఈ ఘటనతో నాయుడుపేట, కావనూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు రాజేంద్రకు భార్య రాధ, ఇంటర్, 9వ తరగతి చదువుతున్న కొడుకు దినేష్, కుమార్తె భవ్య ఉన్నారు.

విజ్ఞాన దర్పణం సంస్కృత భాష

- ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు
- భాషోత్సవ సదస్సులో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం



పుస్తకావిష్కరణలో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సంస్కృతభాషలో వైజ్ఞానికం దాగిఉందని ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు అన్నారు. రామసేతు, బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం తదితర నిర్మాణాలు సంస్కృతంలోని వైజ్ఞానికతని తెలియజేస్తాయన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన భాషోత్సవం జాతీయ సదస్సు ముగింపు, అక్షర పురుషోత్తమ మందిర ఆవిష్కరణ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామితో కలిసి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీలోని హెరిటేజ్ కారిడార్‌లో నిర్మించిన స్వామినారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ మందిరాన్ని వారు ఆవిష్కరించారు. జగన్నాథమందిరంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గవర్నరు, సీఎంలకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సభాకార్యక్రమంలో గవర్నరు హరిబాబు మాట్లాడుతూ..సంస్కృతభాష మానవ జీవనాన్ని నడిపించే లివింగ్ లెగసీ అన్నారు. తనస్వగ్రామం తిమ్మసముద్రంలో సంస్కృత ఓరియంటల్ కళాశాల ఉండేదని, అక్కడ సంస్కృతాన్ని చక్కగా బోధించేవారని గుర్తు చేసుకున్నారు. సంస్కృతంలోని పాణినీయ వ్యాకరణం నేటి కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, ఆధునిక ఏఐకి ఉపయోగకరమన్నారు.

సంస్కృతంలో భారతీయ జ్ఞానపరంపర

సీఎం పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. భారతీయ జ్ఞానపరంపర సంస్కృతభాషలోనే నిగూఢమై ఉందన్నారు. నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం, రాజనీతిశాస్త్రం తదితర సర్వవిధార్మికాంశాలు ఇందులోనే ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతభాషాభివృద్ధికి వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అధ్యాపకులను సాధు భద్రేశదాస్‌స్వామి చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి, శ్రీపరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.గణపతిభట్, థింక్ ఇండియా కౌన్సిల్ మెంబర్ సౌరవ్‌పాండే, కోఆర్డినేటర్ డాక్టర్ జ్ఞానరంజన్ పండా, ఉత్తరాఖండ్ డిజాస్టర్ మేనేజిమెంట్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కె.రుహెల్లా, డీన్లు, హెచ్‌వోడీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిసిటీ కోసమే ఇదంతా..



తిరుమల భద్రతలో భాగంగానే మఠాలకు నోటీసులు ఇచ్చారు. దీనిపై భక్తులకు రాని ఇబ్బందులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డికే వస్తున్నాయి. కేవలం పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారు. టీటీడీలో పారదర్శక పాలనతో శ్రీవారి భక్తులకు మేలు జరుగుతుంటే ఓర్వలేక భూమన విమర్శలు చేస్తున్నారు. కుంకీ ఏనుగలతో వైల్డ్ ఎలిఫెంట్ డ్రైవ్ జరుగుతోంది. దీనిపై బుర్రలేకుండా మాట్లాడుతున్న వైసీపీ నేతలను కూడా తరిమికొట్టాలి.

- జనసేన నేత కిరణ్‌రాయల్, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జైలే



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'తల్లిదండ్రులు, వయో వృద్ధుల సంరక్షణలో ఆయా కుటుంబాలు బాధ్యత వహించాలి. నిర్లక్ష్యం వహించే వారిపై వయోవృద్ధుల చట్ట ప్రకారం రెండు నెలల జైలు శిక్ష, లేదా రూ.5వేల జరిమానా విధిస్తారు' అని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై వివిధ శాఖ అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేని కారణంగా వివాదాలు తలెత్తుంటాయన్నారు. శ్రీమంతుల కుటుంబాల్లోనూ ఇలాంటి పరిస్థితులు చూస్తుంటామన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన నుంచి అతని ఆస్తి నుంచి తనుక తాను కాపాడుకోలేకపోయినపుడు ప్రాథమికంగా ఆర్డీవో అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆర్డీవో ద్వారా సదరు వ్యక్తులకు నోటీసులు అందించి విచారిస్తారన్నారు. అప్పటికీ సమస్య సామరస్యంగా పరిష్కారం కాకుంటే.. ఆ వ్యక్తులపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత అసోసియట్‌ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసంప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్, ఐసీడీఎస్‌ప పీడీ వసంత, పాస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌కు కరెంటు తీగలు తాకి డ్రైవరు మృతి



మృతి చెందిన చిరంజీవి

శ్రీకాళహస్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీకి కరెంటు తీగలు తాగడంతో విద్యుదాఘాతం సంభవించి డ్రైవరు చిరంజీవి(38) మృతి చెందారు. ఈ దుర్ఘటన మంగళవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని చెన్నై రహదారిపై భక్తకన్నప్ప కూడలి సమీపంలో చోటుచేసుకుంది. పిచ్చాటూరు మండలం కీలపూడికి చెందిన చిరంజీవి లారీ డ్రైవర్. ఈ క్రమంలో మంగళవారం రేణిగుంట నుంచి శ్రీసిటీకి కంటైనర్ లారీ తో బయలుదేరారు. భక్తకన్నప్ప కూడలి సమీపంలో లారీ వెళ్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగులుకున్నాయి. లారీ దిగేందుకు డోరు తాకగానే ఒకసారిగా చిరంజీవి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలారు. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు చిరంజీవి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

చుర్రుమంటున్న సూరీడు



నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు రోడ్డు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా సూరీడు ఉగ్ర రూపాన్ని చూపిస్తున్నాడు. రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఇంటా బయటా ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు మండిపోతున్నాడు. వర్షాకాలంలో వేసవికి మించి ఎండలు వడగాడ్పులతో కూడిన ఎండ కాస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. వద్ధులు, చంటి పిల్లలు ఉక్కపోత తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నారు. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. మరో పక్క తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్ఐలు బ్రహ్మ నాయుడు, స్వప్న

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై వేధింపులు, మహిళల భద్రత, సైబర్ మోసాలపై స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల గురించి తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళ భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకొచ్చిందని, మహిళలు, విద్యార్థులు ఎవరైనా వేధింపులకు గురైన వెంటనే ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించవచ్చన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్ఐలు బ్రహ్మనాయుడు, స్వప్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐతో పారదర్శకంగా ఉపాధి మస్టర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్‌రావు

గూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవకతవకలను నియంత్రించి పారదర్శకంగా మస్టర్లను రూపొందించేందుకు ఏఐ ఆధారిత విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు డ్వామా ఏపీడీ వరప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్టర్లలో అవకతవకలను నివారించేందుకు నేషనల్ మస్టర్ మానటరింగ్ సిస్టమ్ ఆధ్వర్యంలో ముఖ ఆధారిత హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చినా కొన్ని చోట్ల అవకతవకలు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 10 నుంచి ఏఐ ఆధారిత ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెట్టనుందన్నారు. ఈ విధానంలో భాగంగా అప్‌లోడ్ చేసిన ఫొటోలో ఎంత మంది పనులు చేస్తున్నారో గుర్తించి మస్టర్లు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, కాంచన పాల్గొన్నారు.

ఆర్ముగం రాజరాజన్‌కు ఘనంగా వీడ్కోలు



రాజరాజన్ దంపతులను సన్మానిస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): షార్ డైరెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ)కు వెళ్లిన ఆర్ముగం రాజరాజన్‌కు మంగళవారం షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రస్తుత షార్ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ పద్మకుమార్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆర్ముగం రాజరాజన్‌ను ఘనంగా సన్మానించా, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, పలువురు షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

పెళ్లకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందించారు. అమరావతిలో మంత్రిని కలసి రైతుల సమస్యలను వివరించారు. గతేడాది సంభవించిన తుఫాను దెబ్బకు జిల్లాలో 33 శాతం వరి పంట దెబ్బతిందని, రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, ఆశాకిరణ్, ఇండ్ల శశికిరణ్ ఉన్నారు.

12న ఓజిలి మండల సమావేశం

ఓజిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీన ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత

తడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వేనాడు మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజా సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామగ్రిని అందజేశారు. పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎంఎం చంద్రబాబు, అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు మమత పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతున్నాం: పాశిం



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో గ్రామాల్లో అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని రుద్రవరం, గూడలి పంచాయతీలోని చంద్రశేఖరపురం గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి కూటమి పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని మహిళలు అడుగడుగున హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. రుద్రవరంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సారె అందజేసి ఆశీర్వదించారు. అదేవిధంగా చంద్రశేఖరపురంలో సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతున్నామన్నారు. వైసీపీ నాయకులు కళ్లుమూసుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, కళ్లు తెరచిచూస్తే అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, మైనార్టీ సెల్ నాయకులు మస్తాన్‌బాషా, చోటా సాహెబ్, యల్లశిరి కృష్ణయ్య, శ్రీనివాసులు, ముత్యాలయ్య, వెంకట కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కురుగొండ్ల



బైరవరంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని బైరవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అగుడు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమ్మఒడి కుటుంబంలో ఒక్కరికే ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేయడం జరుగుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల హామీల అమలుతో ప్రతికుటుంబం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా, అన్ని ప్రాంతాలను కలుపుతూ లింకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యం నాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, శింగంశెట్టి భాస్కర్ రావు, కూను శ్రీహరి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, నల్లబోతుల మురళి, చిత్తూరు ఈశ్వరయ్య, సీసీ నాయుడు, ఎంపీటీసీ వేళ్ల సురేంద్ర రెడ్డి, దాసరి కోటేశ్వరావు, దాసరి పెంచలయ్య, దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యల పరిష్కరించేందుకు చర్యలు

వెంకటగిరి: వార్డులో సమస్యలన్నింటినీ విడతలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. మంగళవారం పట్టణ పరిధిలోని 17వ వార్డు కలివేలమ్మగుడి వీధిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డులో తాగునీరు, డ్రైనేజ్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఆయన విడతల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, నాయకులు మంకు ఆనంద్, అవ్వారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన



ర్యాలీ కరపత్రాలతో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథరెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మ నాయుడు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం అందించే వివిధ రకాల సేవలను కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే పొందేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వాట్సప్ గవర్నెన్స్ సేవలపై మంగళవారం సూళ్లూరుపేట పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహించిన ర్యాలీలో వాట్సప్ గవర్నెన్స్ సేవలు, ఉపయోగాలను వివరించే కరపత్రాల ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథరెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మ నాయుడు, ఆర్ఐ రాజగోపాల్, రెవెన్యూ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ప్రభుత్వం



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ ఫజులుల్లా, తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజల చేతుల్లోకే ప్రభుత్వం వచ్చిందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వాట్సాప్ నెంబరు 9552300009కు ఒక్క మిస్‌కాల్ ఇస్తే వివిధ శాఖల్లో 200 పైగా సేవలు పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయాలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న ఉప సర్పంచ్ సుబ్బారావు

ఓజిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి సచివాయలంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన సిబ్బందికి ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసూన, అగ్రికల్చర్ అసిస్టెంట్ భావన, మహిళా పోలీసు వెంకటరమణమ్మకు శాలువాలు కప్పి సత్కరించారు. బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ టైపిస్ట్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నాయుడుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బీడీకాలనీ, కొత్త బీడీకాలనీ, లోతువానిగుంట ప్రాంతాల్లో రెండు రోజులుగా నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలేరమ్మ గుడి వద్ద ఉన్న రిగ్ బోరు నుంచి నీళ్లు తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. లోతువానిగుంట ప్రాంతంలో బోరు మోటరు కాలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా చెప్పారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విజయ, మాధురి, లక్ష్మి, స్నేహలత, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

కోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రాఘవాపురంలో ఇద్దరి మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన రహీముల్లా అదే గ్రామానికి చెందిన అనిల్‌కు కొంత నగదును అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించే విషయంలో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. మంగళవారం బాకీ విషయమై అనిల్‌ను రహీముల్లాను నిలదీశాడు. దీంతో అనిల్, శ్రీనివాసులు కలిసి ఇంట్లో ఉన్న రహీముల్లాపై దాడి చేశారు. రాయితో బలంగా కొట్టడంతో రహీముల్లా తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకులంలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీరత్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, రాజ్యలక్ష్మి, విజయ భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, నాశిన నాగులు, సనత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, నవీన్‌జయకుమార్, మేరీ, డాక్టర్లు సత్యశ్రీ, నారాయణ, కీర్తి, త్రివిక్రమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి

గూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఆపాలని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక శాంతినగర్‌లోని సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్‌బిల్లుల భారం అధికమవుతుందన్నారు. ఈనెల 11న స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, చంద్రయ్య, ప్రసాద్, శంకరయ్య, మధు, మణి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దు

డక్కిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ డక్కిలి సబ్‌స్టేషన్ వద్ద రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గౌతమ్ అదానీకి లబ్ధి చేకూర్చేందుకే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు పెనమాల నారాయణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు ప్రజలకు భారంగా మారుతున్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య అన్నారు. మంగళవారం స్థానిక పాలకేంద్రం వద్ద ఉన్న సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బ రాయుడు, కృష్ణారెడ్డి, చిన్న ఓబయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు ముర్రుపాలు రోగనిరోధక శక్తి పెంచుతాయని సీడీపీవో షంషాద్‌బేగం అన్నారు. మంగళవారం స్థానిక తిమ్మాయగుంట గ్రామంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, కుసుమ, లీల, సుప్రియ, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధకశక్తి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బిడ్డలకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నాయుడుపేట మండలం చలివేంద్రలో ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పాలు, గుడ్లు, పెరుగు, వేరుశనగ ముద్దలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, బెల్లం, ఖర్జూరం, జామకాయ వంటి వాటిల్లో మంచి పౌష్టికాహారం ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మున్నెయ్య (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమాల గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పేరువాయి మున్నెయ్య(50) మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ అమర్చుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పశువుల కాపరి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంటలో పడి...



చంద్రబాబు(ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామం సమీపంలోని శివాలయం వద్ద ఉన్న నీటి గుంటలోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... నాయుడుపేట మండలం వేముగుంట పాళెం గ్రామానికి చెందిన చంద్రబాబు(42) వాకాడు మండలంలోని కల్లూరులో వివాహం చేసుకుని, అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో మృతదేహం తేలియాడుతుండగా గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో...

గూడూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య వివరాల మేరకు... అస్సాం రాష్ట్రం డింగ్‌డింగా గ్రామానికి చెందిన రూపక్‌రాయ్(23) మంగళవారం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నుంచి బయటకు వస్తుండగా ఆర్పీ వద్ద కూర్చొని సొమ్మసిల్లిపోయాడు. స్థానికులు గమనించి 108 స్పిందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డుతో అస్సాంవాసిగా గుర్తించారు. అతని పర్సులో లభ్యమైన ఫోన్ నంబరుకు కాల్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, రూపక్‌రాయ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, పరిస్థితి విషమించి మృతి చెంది ఉంటాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే విజయశ్రీ విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుతో విజయశ్రీ

తడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే విజయశ్రీ కలిశారు. స్వర్ణముఖి, కాలంగి నదుల వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కాళంగి గ్రాయిన్, పెళ్లకూరు మండలం చెంబేడు మినీ రిజర్వాయర్ పనులకు ఆర్థికశాఖ నుంచి, అనుమతులు లభించేలా చర్యలు తీసుకోవాలని అలాగే కొరిడి - పేర్నాడు బీటీ రోడ్డు, మీజూరు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు అటవీ అనుమతులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

అండర్ బ్రిడ్జి నిర్మించండి



పీడీ ఎంకే చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడతావారిపార్లపల్లి సమీపంలోని సాగరమాల రోడ్డుపై అండర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ మంగళవారం నెల్లూరులోని జాతీయ రహదారుల సంస్థ పీడీ ఎంకే చౌదరికి సర్పంచు త్రివిక్రమ్‌భూపతి, టీడీపీ నాయకులు మేకల కుమార్, భాస్కర్ వినతిప్రతం అందజేసిశారు. తమ గ్రామ సమీపంలో సాగరమాల రోడ్డుపై అండర్ బ్రిడ్జి నిర్మించకపోతే విద్యార్థులు, రైతులు, సమీపంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడాల్సి వుంటుందన్నారు. విద్యార్థులు, రైతులు, స్థానికుల సౌకర్యార్థం అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

ముగిసిన రామకృష్ణమిషన్ ఆశ్రమ వార్షికోత్సవం

తిరుపతి అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మిషన్ ఆశ్రమం దశమ వార్షికోత్సవం మంగళవారం జరిగిన పురుషుల యువజన సమ్మేళనంతో ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సనాతనమైనదని అందరూ కలసి జీవించాలని చెబుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్వీ ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, స్వామిహృదానందజీ, స్వామిశితికంఠనందజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ విద్యార్థుల హాస్టల్ సమస్యను పరిష్కరిస్తాం

తిరుపతి(విద్య), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు హాస్టల్ వసతి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టీటీడీ ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన పద్మావతి మహిళా జూనియర్ కళాశాలను సందర్శించారు. హాస్టల్లో సీట్లు రాక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మండలాభివృద్ధికి సహకరించండి: ఆదిమూలం



శ్రీనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఎంపీపీ సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో రూ.3 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రతి పాదనలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గ్రామానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అంబేడ్కర్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. తెలుగుగంగ కాలువ పూడికతీత పనులకు రూ. 22లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పెద్దపాలేడు, కల్లివెట్టు, నెరిణికండ్రిగ, పుత్తేరి, పార్లపల్లి, కాంపాళెం, కొత్తపాళెం, చిన్నయ్యగుంట, కాటూరు తదితర గ్రామాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. చలంవారి గిరిజన కాలనీలో 20 గిరిజన కుటుంబాలు ఇళ్ల కూలే దశలో ఉన్నాయని కొత్తగా పక్కా గృహాలు మంజూరు చేయాలని సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కారణి, కంచనపుత్తూరు పంచాయతీలకు పశువైద్యాధికారులు రావడం లేదని ఫోన్ చేసినా కూడా తీయడం లేదని సర్పంచులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలో అన్నదాత సుఖీభవ మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో శ్రీనిధి ద్వారా రూ. 2.93కోట్ల చెక్కులను అందజేశారు. ఏపీ షణ్ముగం, శ్రీనిధి మేనేజర్ వనజ, సీసీలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా: నాలుగు ట్రాక్టర్ల సీజ్



ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

రేణిగుంట, ఆగస్టు 5(ఆంధ్ర జ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం ఉదయం సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మండలంలోని ఎస్ఆర్ పట్టెడలోని ప్రైవేటు భూమిలో అనుమతి లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తుండగా తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి రెవెన్యూ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్లను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు. అలాగే సోమవారం రాత్రి ములగముడి గ్రామంలోని చెరువులో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్నారంటూ గ్రామస్తులు గాజుల మండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మూడు ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. నలుగురు డ్రైవర్లను, వాహన యజమానులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీలోకి జడ్పీటీసీ సభ్యురాలు?



సత్యవేడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు జడ్పీటీసీ సభ్యురాలు కూరపాటి విజయలక్ష్మి, కూరపాటి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరనున్నట్లు సమాచారం. వీరు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది. తిరుపతిలో గురువారం జరగనున్న ఓ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువాను కప్పుకోనున్నారు. వీరితో పాటు కొందరు సర్పంచులు, వారి అనుచరులు టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది.

పుత్తూరు వార్తలు

ధర్మరాజస్వామికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ మంత్రి రోజా

పుత్తూరు అర్బన్/ పుత్తూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్రౌపది సమేత ధర్మరాజస్వామి తిరునాళ్లలో భాగంగా స్వామి అమ్మవార్ల వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళవారం కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని కాపు వీధి మీదుగా ద్రౌపది దేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మున్సిపాలిటీ తరఫున మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సారెను సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో చినబాబు, గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డి, అమ్ములు, యుగంధర్, జీవరత్నం నాయుడు, డీఎస్ గణేష్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి రోజా కూడా అమ్మవారి కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ద్రౌపదిదేవి వైభవం

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): ద్రౌపదిదేవి సమేత ధర్మరాజ స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ద్రౌపదిదేవి సమేత ధర్మరాజస్వామి అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ కమిటీ నిర్వాహకులకు కృష్ణప్ప మెదలి, యగంధర్, మునిచంద్ర, దామోదరం, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు



అవగాహన ర్యాలీలో ధనంజయులునాయుడు తదితరులు

వడమాలపేట,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా అందించే పౌర సేవలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు కోరారు. మంగళవారం వడమాలపేటలో మన మిత్ర వాట్సప్ నెం.9552300009ను ఉపయోగించుకుని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎవరికీ వారు వాట్సప్ ద్వారా సంబంధిత ఆధారాలతో సర్టిఫికెట్లు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శివరాయల్, నాయకుడు యాకూబ్, పంచాయతీ కార్యదర్శి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

పుత్తూరు,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ చంద్రమౌళి పంపిణీ చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, నరసింహులు, సుజన పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయండి

పుత్తూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు పుత్తూరు తాలూకా పరిధిలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమానికి మిశ్రమ స్పందన లభించింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమానికి పది మంది ఉద్యోగులు కూడా హాజరుకాలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, తాజా పీఆర్సీ తక్షణమే విడుదల చేయాలని రవికుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆర్వో పెంచలయ్య, టీపీవో నీరజాక్షి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన

రేణిగుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర చెప్పారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ఈ మేరకు అవగాహన కల్పించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ట్రైనీ ఎస్ఐ స్వాతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలు... ఇబ్బందుల్లో విద్యార్థినులు!



అసంపూర్తిగా బాలికల మరుగుదొడ్లు, ట్యాంకులు - పునాదులకే పరిమితమైన తరగతి గదుల నిర్మాణం

కేవీబీపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సదాశివపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ మరుగుదొడ్లు, తరగతి గదులు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 60మంది బాలికలు పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు- నేడు నిధుల కింద పాఠశాలలో మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు మొదలుపెట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఉన్న మరుగుదొడ్లను కూల్చివేయడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే గదులు చాలక పాఠశాల వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కలెక్టర్, విద్యా శాఖ అధికారులను కలిసి సమస్యను విన్నవించారు. విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలవుతున్నా వీటి నిర్మాణాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. నిర్మాణాలకు సంబంధించి నిధులున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ సోమవారం విడుదల చేసిన మొదటి సెమిస్టర్‌లో పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. బీఎస్సీ (ఆనర్స్) లహరి 8.8, శిరీష 8.3, రమ్య 8.08, బీఎస్సీ(బయోటెక్నాలజీ)లో చంద్రిక, సుజాత 7.55, అంజలికుమారి 6.48, వాణిప్రియ 6.25 పాయింట్లు సాధించారు. బీకాం(సీఏ)లో షేక్ మస్రత్ 9.30, ప్రత్యూష 9.25, మేఘన 8.65 పాయింట్లు సాధించారు. వారిని మంగళవారం కళాశాల కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

బకాయిలు చెల్లించండి



సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు శాంతి దుర్గ, శ్రీనాథ్... ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఉద్యోగుల సమస్యలు, పరిష్కారంపై చర్చించారు. దాము, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే అమృతతుల్యం

పిచ్చాటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అమ్మ పాలు అమృత తుల్యమని దాన్ని బిడ్డకు దూరం చేయవద్దని ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యం తెలిపారు. మంగళవారం పిచ్చాటూరు పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ముర్రుపాలను అందిస్తే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో వ్యాధి నిరోధకతను వృద్ధి చేసుకుంటుందన్నారు. సూపర్‌వైజర్లు సుమతి, భజావతి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం బాలింతలకు, గర్భిణులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. కండ్రిగ ఉమ, డాక్టర్ లక్ష్మీనారాయణ, గరికపాటి రమేష్‌బాబు, వైద్యులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గురవయ్య



శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సీపీఐ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జనమాల గురవయ్య నియమితులయ్యారు. సీపీఐ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో ద్వితీయ జిల్లా సభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, పార్టీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి హరినాథ రెడ్డి పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన జనమాల గురవయ్య రెండో సారి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

సూర్యప్రభపై నీలకంఠేశ్వరస్వామి రాజసం



శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి మంగళవారం సూర్యప్రభ వాహనంపై గ్రామంలో విహరించారు. ముందుగా స్వామిఅమ్మవార్లకు ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామిఅమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై గ్రామంలో ఊరేగారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. గీత కులాల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా వారికి మద్యం దుకాణాల్లో రిజర్వేషన్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకుందన్నారు. రాష్ట్రంలోని గౌడ, యాత, ఈడిగ, గామల్ల, కలాలి, గౌండ్ల తదితర కులాలకు మొత్తం 335 మద్యం దుకాణాలు కేటాయించిందన్నారు. ఇప్పుడు బార్లలో కూడా పది శాతం కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. ఇక సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 7 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్, గాజుల భగత్, భీమాల భాస్కర్, మణి, మురళీకృష్ణ, కృష్ణమూర్తి, మురళీనాయుడు, సులేమాన్, శివ, చంద్రమౌళి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనాలకు అనుమతి లేదా పరమేశా?

శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ముక్కంటి క్షేత్రంలో ప్రవచనాలకు అనుమతి లేకపోవడం శోచనీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. శుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం వారి ఆధ్వర్యంలో చాతుర్మాస వ్రత ప్రవచనాలకు ముత్యాలమ్మ ఆలయ కళ్యాన మండపంలో అనుమతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈవో బాపిరెడ్డి స్పందించి అనుమతులు మంజూరు చేయాలన్నారు.

సీఎంలకు సాదర స్వాగతం



ఉత్తరాఖండ్ సీఎంకు స్వాగతం పలుకుతున్న జేసీ తదితరులు

రేణిగుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామేకు సాదర స్వాగతం లభించింది. మంగళవారం మధ్యాహ్నం ఇండిగో విమానంలో ఢిల్లీ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలాఆనంద్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అలాగే సిక్కిం రాష్ట్ర సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్‌కు సాదర స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో చేరుకున్న ఆయనకు ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

గంగమ్మ జాతరకు చాటింపు

రేణిగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గ్రామ దేవత గంగమ్మ జాతర ఉత్సవాలకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఖడ్గాన్ని, త్రిశూలాన్ని డప్పువాయిద్యాల నడుమ పొలి మేరకు ఊరేగారు. పొలిమేర దేవతలకు పూజలు చేసి గంగమ్మ జాతర మహోత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు రాకుండా ఆశీర్వదించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన శంకర్‌రెడ్డి



సత్యవేడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌ను అమరావతిలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై శంకర్‌రెడ్డి మంత్రికి వివరించారు. అదే విధంగా ఇక్కడ నెలకొన్న రాజకీయ పరిణామాల ను మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్లు శంకర్‌రెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వాహణలో సత్యవేడు నియోజకవర్గం జిల్లాలో రెండో స్థానంలో నిలవడంపై శంకర్‌రెడ్డిని లోకేశ్ అభినందించినట్లు తెలిసింది. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళుతూ క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని మంత్రి తనకు సూచించినట్లు శంకర్‌రెడ్డి తెలిపారు.

అగన్య గణపతి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవ గణపతుల్లో ఒకరైన భేరివారి మండపం వద్ద కొలువైన అగన్య గణపతి ఆలయ పునఃప్రారంభ పనులను మంగళవారం ఆలయ ఇంజనీరింగ్ అధికారులు సూచనలతో పురపాలకసంఘ అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే సుధీర్ ఆదేశాల మేరకు రానున్న వినాయక చవితి ఉత్సవాల్లోగా పనులను పూర్తి చేయడానికి పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. టీడీపీ నాయకులు నాగమల్లి దుర్గాప్రసాద్, వినయ్‌కుమార్, వజ్రం కిషోర్, పురపాలకసంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై వీరభద్రుడి ప్రాకార విహారం



నారాయణవనం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు అశ్వవాహనంపై ఆలయ ఆవరణలో విహరించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల వసంతోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారు అశ్వవాహనంపై ఆలయ ప్రాంగణంలో విహరించారు. ఆలయ అధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా ఏకాదశి



నారాయణవనం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా ఉదయం స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఉభయనాంచారులతో స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఏకాదశి కావడంతో భక్తులు ఉపవాస దీక్షతో స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి శిక్షణతో ఆత్మస్థైర్యం

రేణిగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వృత్తి శిక్షణ ద్వారా ప్రతి మహిళకు ఆత్మస్థైర్యం కలుగుతుందని రాస్ డైరెక్టర్ ఎం.మోహన్ అన్నారు. మండలంలోని కరకంబాడి ఇందిరా నగర్‌లో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయంలో పొదుపు సంఘాల సభ్యులకు జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు జరిగే ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.